క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి ప్రతిపాదనలు



కమిటీ ప్రతినిధుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఏఈ చందన

నరసన్నపేట: మండలంలోని కామేశ్వరిపేట పంచాయతీ కొల్లవానిపేటలోని ఉమారుద్ర కోటేశ్వరాలయం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, ఈ మేరకు నిదుల కోసం ప్రతిపాదనలు పంపుతున్నట్లు దేవదాయ, ధర్మాదాయ శాఖ ఏఈ టి.చందన అన్నారు. గురువారం కొల్లవానిపేటలో పునర్ నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని సందర్శించారు. సీజీఎఫ్ నిధులు ఆలయాలకు వస్తున్నాయని, వీటి కోసం ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయం నిర్మాణం పనుల కొలతలు తీసుకున్నారు. ఆలయ నిర్మాణ అంచనాలను ధర్మకర్త బి.లచ్చన్న, అర్చకులు శర్మ, కమిటీ సభ్యులు రమేష్, బైరాగినాయుడు, గ్రామ పెద్ద ప్రభాకర్ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఆరంగి మురళి

నరసన్నపేట: అర్హతే ప్రామాణికంగా పింఛన్లు పంపిణీ చేస్తున్నామని ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. మండలంలోని సత్యవరంలో నూతన పింఛన్లను గురువారం పంపిణీ చేశారు. ఇప్పటికే మండలంలో 11 వేల పింఛన్లు వస్తున్నాయని, ఈ నెల నుంచి మరో 331 పింఛన్లు కొత్తగా మంజూరు చేయడం జరిగిందన్నారు. నరసన్నపేట పంచాయతీ వార్డు సభ్యులు ఇప్పిలి నీలం, సీర లక్ష్మీనారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ ఇమామ్ పాల్గొన్నారు.

రూ.10 వేల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు కృపానందం

మెళియాపుట్టి: జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ తరఫున పాస్టర్ల కుటుంబాలను ఆదుకుంటున్నామని జిల్లా అధ్యక్షుడు కృపానందం అన్నారు. మండలంలోని భరణికోట పంచాయితీ పరిధిలోని తంగిణి గ్రామానికి చెందిన పాస్టర్ సవర రామారావు భార్య కస్తూరమ్మ ఇటీవల మృతి చెందారు. జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ తరఫున సోమవారం రూ.10 వేలు అందజేశారు. ఇదివరకే నిర్ణయించుకున్నట్లుగా పాస్టర్ల కుటుంబాలలో ఎవరైనా మరణిస్తే ఆదుకోవాలనే ఆలోచలనతోనే సహాయం చేయడం జరిగిందన్నారు. అసోసియేషన్ సెక్రెటరీ సాల్మన్, జాయింట్ సెక్రెటరీ ఎం.వి.జోసెప్, ట్రెజరీ ఎస్.విచిత్రో తదితరులు పాల్గొన్నారు.

రూ. 50 వేల విరాళం



రూ.50 వేల చెక్‌ను అందజేస్తున్న దాతలు

పొందూరు: స్థానిక సత్యసాయి సేవా సమితి నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పొందూరు పట్టణానికి చెందిన బొల్లా హరనాథ్, చక్రపాణి, శ్రీనివాసరావు రూ.50 వేల విరాళాన్ని అందించారు. తల్లిదండ్రులు బొల్లా సూరిబాబు, లక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం నిత్య నారాయణ సేవకు ఈ మొత్తం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ డి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వేయింగ్ మిషన్ల సరఫరా



వేయింగ్ మిషన్లను పరిశీలిస్తున్న సీడీపీఓ

సారవకోట: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు వేయింగ్ మిషన్లు సరఫరా అయినట్లు సీడీపీఓ హెచ్.కె.కామాక్షి గురువారం తెలిపారు. సారవకోట, జలుమూరు మండలాల్లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఎత్తు, బరువు కొలిచేందుకు వీటిని వినియోగించనున్నట్లు తెలిపారు.

గడపగడపలో సంతోషం



బూర్జ: సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

బూర్జ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కేకే రాజపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పథకాలు వివరించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎవరికైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే గ్రామ సచివాలయాలను సంప్రదించాలన్నారు. పథకాల కోసం ఎవరికీ ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని కలిసే అవకాశం ప్రభుత్వం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం జగన్ పరిపాలన సాగిస్తున్నారన్నారు. తొలిత అప్పలపట్నాయకునిపేట (ఏపీపేట)లో రూ.59 లక్షల నిధులతో జల్ జీవన్ మిషన్ ద్వారా నిర్మించనున్న ఇంటింటికీ మంచినీటి కుళాయిలకు శంకుస్థాపన చేశారు. మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని స్పీకర్‌ను గ్రామస్తులు కోరారు. ఈ సమస్య వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, తహసీల్దార్ ఎస్.రమణారావు, వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయం

సారవకోట: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని నౌతళ గ్రామంలో సర్పంచ్ పల్లి శ్రీహరి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లి రవి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. వర్షాలు కురిసే సమయంలో ఇళ్లల్లోకి నీరు చేరుతుందని, దీనివల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్తులు తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఐటీడీఏ పీఓ దృష్టికి సమస్య తీసుకెళ్లి సమస్య పరిష్కరించనున్నట్లు తెలిపారు. మాజీ జెడ్పీటీసీ ధర్మాన పద్మప్రియ, సారవకోట పీఏసీఎస్ చైర్మన్ గెల్లంకి వెంకటరావు, సర్పంచ్ కొండాల బాబూరావు, శంకర బాబు, ఇసై షణ్ముఖరావు, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, ఎడ్ల అసిరయ్య, పార్టీ నాయకులు కాళ్ల సింహాచలం, రంజిత్, నక్క తులసీదాస్, యాళ్ల శ్యామసుందరరావు, మెండ రామకృష్ణ, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.



సారవకోట: సంక్షేమ పథకాల లబ్ధి పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

అంగన్‌వాడీలకు యూనిఫాం పంపిణీ



అంగన్‌వాడీలకు యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట(పాతపట్నం): అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పనితీరు ఆదర్శవంతంగా ఉండాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు యూనిఫాం పంపిణీ చేశారు. పాతపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో జీతాలు ప్రతినెలా సక్రమంగా చెల్లించాలని, అంగన్‌వాడీల కనీస కోర్కెలు తీర్చాలని ఆందోళన చేస్తే.. మహిళలు అని చూడకుండా మాజీ సీఎం చంద్రబాబు గుర్రాలతో తొక్కించి, పోలీసులతో ఈడ్చుకెళ్లారని, అది మరిచిపోలేని సంఘటన అని అన్నారు. మీరంతా బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బాల్యవివాహాలను అరికట్టాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యం, విద్య పట్ల మరింత బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఒక్కొక్క కార్యకర్త, ఆయాకు ప్రభుత్వమే రెండు జతల యూనిఫాం పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం ఐసీడీఎస్ సీడీపీఓ విమలాకుమారి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు వేగవంతం

ఎల్.ఎన్.పేట: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ చురుగ్గా జరుగుతుందని వ్యవసాయ అధికారి పైడి లతశ్రీ అన్నారు. కొమ్మువలస గ్రామంలో జరుగుతున్న ఈ–క్రాప్ నమోదును గురువారం పరిశీలించారు. ఈ–క్రాప్ నమోదు కోసం గ్రామాలకు వచ్చే వ్యవసాయ సహాయకులకు రైతులు సహకరించాలన్నారు. ఈ–క్రాప్ నమోదు చేసుకోవటం వల్ల పంటల నష్ట పరిహారం పొందేందుకు, పంట దిగుబడులు అమ్ముకునేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. గ్రామ సచివాలయ వ్యవసాయం శాఖ సహాయకులు బాలచంద్రుడు పాల్గొన్నారు.

నరసన్నపేట: మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ త్వరితగతిన పూర్తిచేయాలని ఏఓ కె.సునీత అన్నారు. కరగాం, కంబకాయల్లో గురువారం పర్యటించి ఈ–క్రాప్ నమెదును పరిశీలించారు. మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 20,080 ఎకరాలని అన్నారు. వరి ఉభాలు 18,282 ఎకరాల్లో రైతులు వేశారని, ఇప్పటివరకు ఈ–క్రాప్ 9,120 ఎకరాల్లో నమోదు చేయడం జరిగిందన్నారు. సర్వే నంబర్ల మ్యాపింగ్ ఉండటంతో జాప్యం అవుతుందని ఏఓ దృష్టికి వీఏఏలు తీసుకువచ్చారు. వీఆర్వోలు సహకరించాలన్నారు. రైతుల పొలాల వద్దకు వెళ్లి సర్వే నంబర్ చూపిస్తే ఈ–క్రాప్ నమోదు త్వరితగతిన పూర్తవుతుందన్నారు.



నరసన్నపేట: కరగాంలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ సునీత

ఉపాధ్యాయునికి సత్కారం

పాతపట్నం: గంగువాడ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న పి.రేవతీవల్లభరావు ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన నేపథ్యంలో పాతపట్నం రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రామరాజు, పలువురు ఉపాధ్యాయులు గురువారం సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి, విద్యాబోధన తీరును కొనియాడారు. అవార్డు అందించినందుకు అభినందనలు తెలిపారు. పలువురు ట్రస్ట్ సభ్యులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.



రేవతీవల్లభరావును సత్కరిస్తున్న దృశ్యం

చంద్రబాబు మోసకారి

- నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేసిన స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: మహిళలను మోసం చేసిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస (మున్సిపాలిటీ, మండలం)లో నూతనంగా మంజూరైన 267 పింఛన్లను స్థానిక మార్కెట్ యార్డులో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయంలో రుణ మాఫీచేస్తానని మహిళలను నమ్మించి చివరకు పసుపుకుంకుమ పేరుతో కనీసం వడ్డీ కూడా చంద్రబాబు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం మళ్లీ ఎన్నికలు వస్తున్న సందర్భంగా ప్రజల్లోకి వస్తూ మహిళలను కోటీశ్వరులను చేస్తానని మాయమాటలు చెబుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, పార్టీ మండల అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామమూర్తి, ఆమదాలవలస జెడ్పీటీసీ బెండి గోవిందరావు, పార్టీ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు బొడ్డేపల్లి అజంతా కుమారి, డి.శ్యామలరావు, శిల్లా మల్లికార్జునరావు, డి.చిరంజీవిరావు, ఎ.ఉమామహేశ్వరరావు, బోర చిన్నంనాయుడు, సాదు కామేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, సచివాలయాల కోఆర్డినేటర్లు బొడ్డేపల్లి నిరంజన్ బాబు, అత్తులూరి రవికాంత్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఊరటనిచ్చిన వర్షం



పోతయ్యవలస వద్ద పొలంలో చేరిన వర్షం నీరు

నరసన్నపేట: అల్పపీడనం ప్రభావంతో మండలంలో బుధవారం నుంచి కురుస్తున్న వర్షాలకు వరి పంటకు ప్రాణం పోశాయి. మండలంలోని పోతయ్యవలస, గోపాలపెంట, మడపాం, దేవాది, లుకలాం, కామేశ్వరిపేట, అంబోజీపేట, కొత్తపోలవలస, పాలకొండపేట గ్రామాల్లో కాలవల నుంచి సాగునీరు సక్రమంగా రాక, వర్షం లేక వరి పొలాలు బీటలు వారాయి. కొద్ది రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే వరి పైర్లుకు తీవ్ర నష్టం కలిగేది. బుధ, గురు వారాల్లో కురిసిన వర్షం వరి పైర్లుకు ప్రాణం పోసింది. వరి పొలాలకు ఈ వర్షం ఉపకరించిందని కోమర్తి నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కనపల శేఖరరావు అన్నారు. వరుణ దేవుడు కరుణించాడని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కోదూరు గ్రామస్తులు

పాతపట్నం : మండలంలోని కోదూరు గ్రామానికి చెందిన సుమారు 150 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు, ఇళ్ల మంజూరు చేయాలని సర్పంచ్ పనుకు నాగమణి ఆధ్వర్యంలో తహసీల్దార్ కె.హరిచంద్రకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు కోదూరులో వేరే గ్రామాలకు చెందిన వాళ్లకి స్థలాలు ఇస్తున్నారని, తమ గ్రామంలో తమకు స్థలాలు ఇచ్చి ఇళ్ల మంజూరు చేయాలన్నారు.

చురుగ్గా విశ్రాంతి భవనం పనులు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–1 పునరావాస కాలనీ ఎస్సీ వీధిలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు తన స్వంత నిధులు రూ.లక్షతో నిర్మిస్తున్న విశ్రాంతి భవనం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. శ్రీనివాసరావు పర్యవేక్షణలో గురువారం భవనం శ్లాబ్ పనులు చేపట్టారు. ఎస్సీ వీధికి చెందిన యువకుల కోరిక మేరకు విశ్రాంతి భవనం నిర్మిస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.



విశ్రాంతి భవనం శ్లాబ్ పనులు చేపడుతున్న దృశ్యం

సేవలే గుర్తింపునిస్తాయి



బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

హిరమండలం: ఉద్యోగి విధి నిర్వహణలో చేసిన సేవలే సమాజంలో మంచి గుర్తింపునిస్తాయని కోరాడ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం ఎం.రాజారావు, సర్పంచ్ లంక రోజా అన్నారు. స్థానిక పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఎల్.వి.రమణ, వి.సూర్యకుమారి, ఎల్.గణపతిరావు, మురళీధర్, టి.శ్రీనివాసరావు, కె.రమణారావు గురువారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోకుల కృష్ణ.. గోపాలకృష్ణ

- ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

జీవితంలో వచ్చే కష్టాలను ఎదుర్కోవడం ఎలా అని తెలిపేది శ్రీకృష్ణభగవానుడేనని పురణాలు చెబుతున్నాయని వక్తలు అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఇస్కాన్, వేంకటేశ్వర ఆలయాలు ముస్తాబయ్యాయి. కృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు ఆకట్టుకున్నారు. పలుచోట్ల ఉట్టికొట్టే కార్యక్రమాల్లో యువకులు, చిన్నారులు పాల్గొని సందడి చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



హిరమండలం: కూర్మ గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డిశాంతికి జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు



ఆమదాలవలస: పట్టణంలో గేటు ప్రాంతంలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



సారవకోట: సత్రాం గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



నరసన్నపేట: విద్యార్థి భవన్‌లో ఇతిహాసాల కథల బొమ్మల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాధు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి



కొత్తూరు: కొత్తూరులోని వేంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఎల్.ఎన్.పేట: కొమ్మువలసలో శ్రీకృష్ణాష్టమి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



నరసన్నపేట: స్థానిక గీతా మందిరంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



సారవకోట: మండల కేంద్రంలో ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు



బూర్జ: బూర్జలో సుందరంగా కొలువుదీరిన శ్రీకృష్ణుడు



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలోని రంగనాథస్వామి ఆలయంలో కృష్ణాష్టమి పూజలు

క్రీడా పోటీలు వాయిదా

సరుబుజ్జిలి: ఈ నెల 8వ తేదీన మండలంలో నిర్వహించనున్న క్రీడా పోటీలు అనివార్యకారణాల వల్ల వాడిపడినట్లు ఎంఈఓ డి.బాలరాజు గురువారం ఒక ప్రకనటలో తెలిపారు.

ఈ నెల 12, 13వ తేదీల్లో సరుబుజ్జిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులు ఈ మార్పును గమనించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలోకి బీజేపీ నాయకుడు

- స్పీకర్ తమ్మినేని సీతారాం సమక్షంలో పార్టీలోకి ఆహ్వానం పలికిన చిరంజీవినాగ్

ఆమదాలవలస: ఆమదాలవలస నియోజకవర్గం పొందూరు మండలానికి చెందిన బీజేపీ రాష్ట్ర వీవర్ సెల్ సభ్యుడు బందారు జైప్రతాప్ కుమార్ గురువారం వైఎస్సార్‌సీపీ చేరారు. ఆమదాలవలసలో స్పీకర్ తమ్మినేని సీతారాం సమక్షంలో పార్టీలోకి చేరిన ఆయనకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. జైప్రతాప్ కొద్ది నెలల క్రితమే బీజేపీకి రాజీనామా చేశారు. విద్యార్థి నాయకుడిగా ప్రతాప్ సేవలను స్పీకర్ తమ్మినేని అభినందించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితుడినై వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు జైప్రతాప్ తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పొందూరు మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గాడు నాగరాజు, ఉప సర్పంచ్ అనకాపల్లి గోవింద్, ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్, వైస్ ఎంపీపీ వండాన వెంకటరావు, పార్టీ నాయకులు వండాన సూరపునాయుడు, బొడ్డేపల్లి ప్రసాద్, బొడ్డేపల్లి జనార్దన్, అనకాపల్లి సత్తిబాబు పాల్గొన్నారు



ప్రతాప్‌కుమార్‌ను కండవావేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చిరంజీవినాగ్